

ఇది సన్నబియ్యం క్యూ

స్టాక్ ఉన్నా సరఫరా చేయని వైనం



రేషన్‌షాపు వద్ద క్యూలో ఉంచిన సంచులు

6

విద్యార్థులకు నాణ్యమైన

భోజనం అందించాలి

మెదక్ జడ్పీ సీఈవో ఎల్లయ్య

8



చేగుంటలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో

'అమ్మమాట.. అంగన్‌వాడీ బాట'లో నిర్మలా జగ్గారెడ్డి



సదాశివపేట మండలం ఆత్మకూర్‌లో నిర్వహించిన 'అమ్మమాట.. అంగన్‌వాడీ బాట' కార్యక్రమంలో పాల్గొన్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

సదాశివపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట' కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పిలుపునిచ్చారు. సదాశివపేట మండలం ఆత్మకూర్ గ్రామంలో మంగళవారం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట' కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ ఒత్తిడితో కూడిన విద్య వద్దు.. ఆటపాటలతో కూడిన అంగన్‌వాడీ విద్య ముద్దు అని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని సూచించారు. అనంతరం నిర్మలా జగ్గారెడ్డి చేతుల మీదుగా చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో సీడీపీవో చంద్రకళ, ఎంఈవో శంకర్, పోషణ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ సౌమ్య, సూపర్‌వైజర్లు లింగమణి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాంరెడ్డి, కాంగ్రెస్ నాయకులు మునిపల్లి సత్యానారాయణ తదితరులు పాల్గొన్నారు.



మహిళా సమాఖ్యను పరిశీలిస్తున్న అధికారులు

ఇస్మాయిల్‌ఖాన్‌పేటలో

రాజస్థాన్ బృందం

గ్రామ సమాఖ్య సమావేశాన్ని పరిశీలించిన అధికారులు

సంగారెడ్డి రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి మండలం ఇస్మాయిల్‌ఖాన్‌పేట గ్రామంలో మంగళవారం నిర్వహించిన మహిళా సమాఖ్య జెండర్ సమావేశాన్ని రాజస్థాన్ అధికారుల బృందం పరిశీలించింది. అధికారులను అడిగి సమావేశం వివరాలు, గ్రామ సమాఖ్య పనితీరును తెలుసుకున్నారు. వారివెంట సెర్ప్ డీపీఎం జయశ్రీ, ఏపీఎం వెంకట్, సీసీలు పాల్గొన్నారు.

సమస్యలతో సతమతం..

రోగులకు శాపం



సంగారెడ్డి జిల్లా ఆరోగ్యశాఖకు సుస్తీ

వెల్‌నెస్ సెంటర్‌లో డాక్టర్లు, మందుల కొరత

టీ–హబ్‌లో నిలిచిన పలు రకాల టెస్టులు

ప్రభుత్వ దవాఖానాల్లో నిలిచిన కు.ని. ఆపరేషన్లు

డిప్యూటేషన్లు, హైర్ వాహనాల దందాకు అడ్డుకట్ట పడేనా?

కొత్త కలెక్టర్ దృష్టి సారిస్తేనే మార్పు సాధ్యం

సంగారెడ్డి అర్బన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో వైద్య, ఆరోగ్య సేవలు గాడితప్పాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోగులకు సకాలంలో వైద్య సేవలందిస్తేనే సర్కారు దవాఖానాలపై ప్రజల్లో నమ్మకం కలుగుతుంది. వైద్య సేవలు అందించడంలో ఏ మాత్రం అలక్ష్యం చేసినా ప్రజలపై విశ్వాసం సన్నగిల్లే అవకాశం లేకపోలేదు. ప్రస్తుతం సంగారెడ్డి జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ పరంగా పలు రకాల సమస్యలతో సతమతమవుతున్నది. కొత్త కలెక్టర్ దృష్టిసారించి చికిత్స చేస్తేనే ప్రజారోగ్య శాఖ గాడిన పడుతుందని, నాణ్యమైన వైద్య సేవలు సకాలంలో అందడంతో పాటు అవినీతికి అడ్డుకట్ట పడుతుందని ప్రజలు ఆశిస్తున్నారు. జిల్లాలో వైద్యఆరోగ్యశాఖలో నెలకొన్న కొన్ని సమస్యలు ఇలా ఉన్నాయి.

డల్‌నెస్ సెంటర్..

సంగారెడ్డిలోని వెల్‌నెస్ సెంటర్‌లో రెండున్నర నెలలుగా పర్మినెంట్ డాక్టర్లు లేరు. ప్రస్తుతం డెంటల్ డాక్టర్‌తో పాటు జీజీహెచ్ నుంచి తాత్కాలికంగా నియమించిన ఓ వైద్యురాలితోనే అరకొరగా వైద్య సేవలందిస్తున్నారు. మందుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. వైద్యులు రాసిన మందులు ఉండడం లేదని పేషెంట్లు వాపోతున్నారు. రెండు నెలలుగా ప్రధానమైన మందులు కొరత ఏర్పడడంతో బయట కొనుగోలు చేస్తున్నామని ఉద్యోగులు, పెన్షనర్లు, జర్నలిస్టులు పేర్కొంటున్నారు.

టీ-హబ్‌లో నిలిచిన పరీక్షలు

సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ప్రాంగణంలోని తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్(టీ-హబ్)లో నెల రోజులుగా పూర్తిస్థాయిలో రోగ నిర్ధారణ పరీక్షలు జరగడం లేదు. రోగ నిర్ధారణకు ఉపయోగించే రసాయనాలు (రీ ఏజెంట్స్) కొరత ఏర్పడటంతో పలు పరీక్షలకు బ్రేక్ పడింది. ఎల్ఎఫ్‌టీ, హెచ్‌బీఏ1సీ, ఆర్ఎఫ్‌టీ, సీఆర్‌పీ, ఆర్ఎ, విటమిన్ డీ-3 పరీక్షలు నిలిచిపోయాయి. దీంతో జిల్లావ్యాప్తంగా ఏరియా ఆస్పత్రులు, సీహెచ్‌సీ, పీహెచ్‌సీల్లో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసరమైన వారు ప్రైవేటు ల్యాబ్‌లకు వెళ్లి డబ్బులు వెచ్చించుకుని పరీక్షలు చేయించుకుంటున్నారు. ముఖ్యమైన టెస్టులు నిలిచిపోవడంతో డయాలసిస్ పేషెంట్లు సైతం తీవ్ర ఇబ్బందులు

మిగతా 8వ పేజీలో

అయ్యో.. అమ్మకెంత కష్టం

తూప్రాన్ ఆసుపత్రిలో గైనకాలజిస్ట్‌ల కొరత

కాన్పు కోసం వచ్చిన గర్భిణులను ఇతర ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్న సిబ్బంది

మూడో వంతుకు పడిపోయిన ప్రసవాల సంఖ్య

7

ఐదు రోజులైనా

తెరుచుకోని పాఠశాల

జీతాలివ్వకపోవడంతో హాజరుకాని ఉపాధ్యాయులు

ఓ ప్రైవేట్ పాఠశాల నిర్వాకం.. విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన



గోమారంలో మూసిఉన్న ప్రైవేట్ పాఠశాల

శివ్వంపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలు పునర్ ప్రారంభమై ఐదు రోజులు గడుస్తున్నా పాఠశాల తెరుచుకోకపోవడంతో వందలాదిమంది విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. మండల పరిధిలోని గోమారంలో ఉన్న ఓ ప్రైవేట్ హై స్కూల్‌లో టీచర్స్ లేక ఇప్పటికీ తెరుచుకోలేదు. ఐదు రోజులుగా వేచిచూసిన విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం పాఠశాల యజమాన్యాన్ని నిలదీశారు. వేతనాలు ఇవ్వకపోవడంతోనే ఉపాధ్యాయులు మానేసినట్లు ఆరోపించారు. ఈ విషయమై పాఠశాల బాధ్యులను సంప్రదించగా ఉపాధ్యాయులు రాకపోవడంతో ఇక్కడ తరగతులు నిర్వహించడం లేదని, విద్యార్థులకు నర్సాపూర్‌లోని మరో ప్రైవేటు పాఠశాలలో క్లాసులు నిర్వహిస్తున్నామని, బుధవారం నుంచి పాఠశాల తెరుచుకుంటుందని, తరగతులు నిర్వహిస్తామని తెలిపారు.

ఆశ్రమ పాఠశాలలో కారం మెతుకులు

కౌడిపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కౌడిపల్లి మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు రెండ్రోజులుగా కారం మెతుకులు పెడుతున్నారు. ఈ పాఠశాలలో మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు 187 మంది విద్యార్థులు ఉన్నారు. తరగుతులు ప్రారంభమైనా.. ఈ నెల 20 వరకు ఎవరూ రావద్దని వార్డెన్ పిల్లలందరినీ తిరిగి పంపించారు. అయితే, పదో తరగతికి చెందిన నలుగురు విద్యార్థులు సోమవారం పాఠశాలకు వచ్చారు. తరువాత రావాలని చెప్తే వినకుండా ముందే వచ్చారని ఆగ్రహంతో వార్డెన్ వారికి రెండ్రోజులుగా తిండి పెట్టడం లేదు. అన్నం మాత్రమే వండుతుండగా కూరలు లేక కారంతో తింటున్నామని విద్యార్థులు వాపోతున్నారు. దీనిపై జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి నీలిమను వివరణ కోరగా ప్రతీ విద్యార్థిని ఫోన్ చేసి పిలవాలని వార్డెన్‌ను ఆదేశించినట్లు తెలిపారు.

అవసరమైన చోట రోడ్ల నిర్మాణం

- మెదక్ మున్సిపాలిటీకి రూ.15 కోట్లు
- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రజల అవసరాలను తీర్చేవిధంగా అభివృద్ధికి కార్యక్రమాలు చేపట్టాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మంగళవారం పట్టణంలోని పలు ప్రధాన రహదారులను పరిశీలించారు. డిగ్రీ కళాశాలకు వెళ్లే రహదారి, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి ఇందిరాపురి కాలనీ, ఐసీఐసీఐ బ్యాంకు నుంచి నర్సిఖేడ్ వరకు, ఎల్ఐసీ నుంచి నవాబుపేట, దాయర నుంచి గాంధీనగర్, కోర్టు రోడ్‌లలో డిప్యూటీ ఇంజనీర్, ఏఈ నితిన్‌లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.15 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఈ నిధులతో జిల్లా కేంద్రంలో దెబ్బతిన్న రోడ్లను బాగు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే పలు రోడ్ల నిర్మాణాలకు అంచనాలు రూపొందించినట్లు తెలిపారు. ప్రాధాన్యతాక్రమంలో అనుమతులు ఇవ్వనున్నట్లు వివరించారు. అభివృద్ధి పనులు నాణ్యతతో చేయాలని, పారదర్శకంగా పనిచేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.



మెదక్ చిల్డ్రన్స్‌పార్కు వద్ద షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్



కలెక్టర్ వల్లూరు క్రాంతికి జ్ఞాపికను అందజేస్తున్న అధికారులు, ఉద్యోగులు

వల్లూరు క్రాంతికి

వీడ్కోలు

సంగారెడ్డి రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి కలెక్టర్‌గా పనిచేసి బదిలీపై వెళ్లిన వల్లూరు క్రాంతి వీడ్కోలు సమావేశం మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా అధికారుల సహకారం మరువలేనిదన్నారు. అనంతరం మహిళా అధికారులు, ఉద్యోగులు వల్లూరు క్రాంతిపై పూల వర్షం కురిపించారు. జ్ఞాపికలు అందజేసి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్‌వో పద్మజారాణి, ఆర్డీవో రవీందర్ రెడ్డి, రెవెన్యూ అసోసియేషన్, టీఎన్జీవో సంఘం నాయకులు, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

స్కూల్‌బస్ డ్రైవర్లకు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు

పిల్లల ప్రాణాలతో ఆటలాడితే కఠిన చర్యలు : సంగారెడ్డి ఎస్పీ



బస్సు డ్రైవర్‌కు డ్రంకెన్‌డ్రైవ్ పరీక్ష నిర్వహిస్తున్న పోలీసు

పటాన్‌చెరు/సంగారెడ్డి క్రైం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు పట్టణ పరిధిలో స్కూల్ బస్సుల డ్రైవర్లకు మంగళవారం ఉదయం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లాలూనాయక్ ఆధ్వర్యంలో డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఈ విషయాన్ని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ ఓ ప్రకటనలో వెల్లడించారు. పాఠశాలలు, కళాశాలల బస్సుల డ్రైవర్లు మద్యం సేవించి బస్సు నడిపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్కూళ్లు, కాలేజీల బస్సుల డ్రైవర్లకు నిరంతరం డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేస్తామని పేర్కొన్నారు. ఎవరైనా మద్యం తాగినట్లు తేలితే కేసులు నమోదు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రైవర్‌తో పాటు విద్యాసంస్థల యాజమాన్యాలపై కూడా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అందుకే ప్రతీ స్కూల్, కళాశాల యాజమాన్యాలు తమ బస్సు డ్రైవర్లను విధుల్లోకి తీసుకొనే ముందు తప్పనిసరిగా డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేయాలన్నారు.

తూప్రాన్‌లో ఫిట్‌నెస్ లేని ఆరు బస్సులు సీజ్

తూప్రాన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణంలో ప్రైవేటు స్కూల్ బస్సులను రవాణాశాఖ అధికారులు తనిఖీ చేశారు. తూప్రాన్ పట్టణంలో ప్రైవేటు పాఠశాలలకు చెందిన ఆరు బస్సులను సీజ్ చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. మెదక్ అసిస్టెంట్ మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు మంగళవారం పోలీసులతో కలిసి ప్రైవేటు స్కూల్ బస్సుల తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో ఫిట్‌నెస్ లేని, టాక్స్ చెల్లింపులు చేయకుండా నడుపుతున్న ప్రైవేటు పాఠశాలల బస్సులను సీజ్ చేశారు. తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్ శివారులోని ఒలంపీయా స్కూల్‌కు చెందిన నాలుగు బస్సులు, ఐడియల్ స్కూల్, అక్షరా గ్రూపుకు చెందిన ఒక్కో బస్సును సీజ్ చేశారు. సీజ్ చేసిన బస్సులను తూప్రాన్ పోలీసుస్టేషన్‌కు తరలించారు.



బీసీ బిల్లు కోసం

జూలై 17న రైల్ రోకో

42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేశాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత

7

ఆర్టీసీ దైవదర్శన ప్రత్యేక టూర్ ప్యాకేజీలు



సంగారెడ్డి అర్బన్/రామచంద్రాపురం టౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : పుణ్యక్షేత్రాలను దర్శించుకునే భక్తుల కోసం స్పెషల్ దైవదర్శనం టూర్ ప్యాకేజీలు తీసుకొచ్చినట్లు సంగారెడ్డి డిపో మేనేజర్ పి.ఉపేందర్, భెల్ డిపో మేనేజర్ సుధ వేర్వేరుగా ప్రకటనల్లో తెలిపారు. సంగారెడ్డి నుంచి మొదటి ప్యాకేజీ కింద ఈ నెల 27న ఉదయం 6 గంటలకు ఎక్స్‌ప్రెస్ బస్సు బయలుదేరి వర్గల్ సరస్వతీ టెంపుల్, యాదగిరిగుట్ట, స్వర్ణగిరి ఆలయాలను ఒకేరోజు దర్శించుకునేందుకు అవకాశం కల్పించినట్లు వివరించారు. ఇందుకు పెద్దలకు రూ.500, పిల్లలకు రూ.350 చార్జీ చేయనున్నట్లు తెలిపారు. రెండో ప్యాకేజీ కింద సంగారెడ్డి నుంచి నాచారం లక్ష్మీనరసింహస్వామి ఆలయం, వర్గల్ సరస్వతి అమ్మవారి ఆలయం, కొమురవెల్లి మల్లన్న ఆలయం, కొండపోచమ్మ ఆలయం, మల్లన్నసాగర్ దర్శించుకునేందుకు పెద్దలకు రూ.500, పిల్లలకు రూ.350 చెల్లించాల్సి ఉంటుందని సూచించారు. 30 మందికిపైగా భక్తులు ఉంటే వారి ఊరు, కాలనీ దగ్గరికే బస్సు సౌకర్యం కల్పిస్తానమన్నారు.


బీహెచ్‌ఈఎల్ డిపో నుంచి..

బీహెచ్‌ఈఎల్ డిపో నుంచి ప్రతీ శుక్రవారం రాత్రి ప్రత్యేక బస్సు బయలుదేరుతుందని డిపో మేనేజర్ తెలిపారు. రాత్రి 10 గంటలకు భెల్ డిపో నుంచి సూపర్‌లగ్జరీ బస్సు బయలుదేరి శనివారం ఉదయం 5 గంటలకు కాళేశ్వరం చేరుతుందని చెప్పారు. అక్కడి నుంచి 9.30కు బయలుదేరి రామప్ప ఆలయానికి, అక్కడి నుంచి మధ్యాహ్నం బయలుదేరి వరంగల్ భద్రకాళి అమ్మవారి దర్శనం, వెయ్యిస్తంభాల సందర్శన అనంతరం భోజనం ఉంటుందని తెలిపారు. అనంతరం సాయంత్రం యాదగిరిగుట్ట, స్వర్ణగిరి దర్శనాలు పూర్తిచేసుకొని రాత్రి తిరిగి భెల్ డిపోకు చేరుకుంటుందని తెలిపారు. సంగారెడ్డి నుంచి బయలుదేరే ప్యాకేజీల బుకింగ్ సమాచారం కోసం 9959226267, 9398690602, 7382831275 నంబర్లను సంప్రదించాలని, భేల్ డిపో నుంచి బయలుదేరే బస్సులో బుకింగ్ కోసం 9391072283, 9063401072 నంబర్లలో సంప్రదించాలని కోరారు. ఒకే కాలనీ లేదా గ్రామంలో 30 మంది భక్తులు ఉంటే బస్సును అక్కడికే పంపుతామని తెలిపారు.

తాము ఆచరించి.. ఆదర్శంగా నిలిచి

ప్రభుత్వ పాఠశాలలకు ఉపాధ్యాయుల పిల్లలు

తూప్రాన్/పాపన్నపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి ఆదర్శంగా నిలిచారు. తూప్రాన్‌కు చెందిన మహేశ్‌గౌడ్ వెల్దుర్తి మండలం కొప్పులపల్లి ఉన్నత పాఠశాలలో హిందీ స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన తనకు కుమారుడు అభిషేక్‌గౌడ్‌ను మంగళవారం తూప్రాన్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 8వ తరగతిలో చేర్పించారు. పాపన్నపేట మండలం పొడ్చన్‌పల్లికి చెందిన శ్రవణ్‌కుమార్ నాగ్సాన్‌పల్లి పాఠశాలలో పనిచేస్తున్నారు. ఆయన తన కుమార్తు కల్యాణ్‌వర్ధన్‌ను తాను పనిచేసే బడిలోనే ఒకటో తరగతిలో చేర్పించారు. వారి ఆయా మండలాల ఎంఈవోలు అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పిస్తున్నట్లు ఎంఈవో తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా బోధన (ఏఐ) కోర్సులు, కంప్యూటర్ కోర్సులను తూప్రాన్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు.



తూప్రాన్‌లో తన కుమారుడిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తున్న ఉపాధ్యాయుడు



నాగ్సాన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో కుమారుడిని చేర్పిస్తున్న ఉపాధ్యాయుడు శ్రవణ్

పుట్టింటికి వెళ్లిన భార్యాపిల్లలు

●మనస్థాపంతో భర్త ఆత్మహత్య



శ్రీనివాస్ (ఫైల్)

నిజాంపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): గొడవలతో తరచూ భార్యా పిల్లలు పుట్టింటికి వెళ్తుండడంతో మనస్థాపం చెంది ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నిజాంపేట మండలంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కల్వకుంట్ల గ్రామానికి చెందిన వల్లకాటి శ్రీనివాస్(51) కొన్ని రోజులుగా అనారోగ్యానికి గురయ్యాడు. అనారోగ్యం వల్ల తరచూ కుటుంబంలో గొడవలు జరుగుతుండడంతో మంగళవారం పిల్లలతో సహా భార్య సరిత పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో శ్రీనివాస్ మానసికంగా కృంగిపోయి మనస్థాపం చెంది తన ఇంట్లోనే మధ్యాహ్నం తలుపులు వేసుకొని దూలానికి ఉరివేసుకున్నాడు. శ్రీనివాస్ తమ్ముడు వెంకటస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేష్ తెలిపారు.

ఇది.. సన్న బియ్యం క్యూ..



రామాయంపేటలోని ఓ డీలర్ షాపు వద్ద వరుసగా ఉంచిన ఖాళీ బస్తాలు

రామాయంపేట , జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మూడు నెలల ఉచిత సన్న బియ్యం సరఫరా డీలర్లను ముచ్చెమటలు పట్టిస్తోంది. డీలర్ల వద్ద స్టాక్ ఉన్నా.. అధికారుల ఆదేశాలు అందక అవస్థలు పడాల్సి వస్తుంది. అంతేకాదు లబ్ధిదారులు బియ్యం కోసం చెప్పులరిగేలా షాపుల చుట్టూ తిరుగుతూ తిట్టి పోస్తున్నారు. మంగళవారం వేకువజామునే లబ్ధిదారులు రామయంపేటలోని రేషన్ దుకాణాల వద్ద వరుసలో ఖాళీ సంచులు పెట్టి వెళ్లారు. పొద్దంతా క్యూలో నిలబడలేక రెండు రోజులుగా ఇలాంటి పరిస్థితి పట్టణంలో కనిపిస్తోంది. స్టాక్ ఉన్నప్పటికీ సివిల్ సప్లై గోదాంలో డీలర్లు వేలిముద్రలు వేయలేదు. దీని వల్ల బియ్యం తీసుకుని వారి థంబ్ కూడా మిషన్లో పడదు. అందువల్ల ప్రస్తుతం బియ్యం పంపిణీ చేయలేని దుస్థితి ఏర్పడింది. మున్సిపల్ పరిధిలో 9 షాపులు ఉండగా.. అంతట స్టాకు వచ్చింది. మరికొన్ని చోట్ల స్టాక్ రాకపోవడంతో తహసీల్దార్ పట్టణంలోనూ సరఫరా నిలపాలని డీలర్లను ఆదేశించినట్లు తెలుస్తోంది. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని బియ్యం సరఫరా అయ్యేలా చూడాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ఘనంగా గ్రామదేవతల జాతర



మల్కాపూర్ గ్రామదేవత జాతరలో భవిష్యవాణి

తూప్రాన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ మండలం మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో గ్రామదేవత జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా బొడ్రాయికి జలాభిషేకం, ఊరడమ్మ, మహంకాళి అమ్మవార్లకు బోనాల సమర్పణ, పోతరాజుల, గావు రంగాలు, శివసత్తుల పూనకాలతో ఉత్సవాలు అట్టహాసంగా జరిగాయి. మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవార్లకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మహదేవీ నవీన్, మాజీ ఉపసర్పంచ్ ఆంజనేయులుగౌడ్, మాజీ ఎంపీటీసీ పంజాల వెంకటమ్మ, మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

కోతులదాడిలో చిన్నారికి గాయాలు

నారాయణఖేడ్,జూన్ 17(ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్‌లో మంగళవారం ఓ చిన్నారిపై కోతులు దాడి చేసి గాయపరిచాయి. పట్టణంలోని కోర్టు కాలనీ సమీపంలో నివాసముంటున్న రాజిరెడ్డి కుమార్తె (4) ఇంటి ఆవరణలో ఆడుకుంటున్న సమయంలో ఆ చిన్నారిపై కోతులు ఒక్కసారిగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. కుటుంబసభ్యులు ఆ చిన్నారిని హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆ చిన్నారి ఎడమచేతికి గాయాలు అయ్యాయి.

ప్రతి ఒక్కరికి క్రమశిక్షణ ముఖ్యం



జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

మెదక్ అర్బన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): యూనిఫామ్ వేసుకున్న ప్రతి ఒక్కరికి క్రమశిక్షణ చాలా ముఖ్యమని, బాధ్యతతో విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు సిబ్బందికి సూచించారు. మంగళవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లాలోని ఆర్మ్డ్ రిజర్వ్, హోంగార్డు సిబ్బందికి దర్బార్ నిర్వహించారు. క్షేత్రస్థాయిలో ఉన్న వారి సమస్యలను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మన చేసే పనులను బట్టి మన విలువ పెరుగుతోందన్నారు. సిబ్బందికి ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా ప్రతి శుక్రవారం కార్యాలయానికి వచ్చి కలవాలన్నారు. చిన్న, చిన్న పొరపాట్లతో జీవితం నాశనం చేసుకోవద్దన్నారు. వ్యక్తిగతంగా, డిపార్ట్‌మెంట్ పరంగా క్రమశిక్షణ చాలా ముఖ్యమని, చెప్పకుండా విధులకు గైర్హాజరు కావద్దని సూచించారు. ప్రతి హోంగార్డు సిబ్బంది లైఫ్ ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు. సిబ్బంది సంక్షేమానికి ఎల్లావేళలా కృషి చేస్తామన్నారు. పోలీసు శాఖలో పని చేస్తూ.. నిబంధనలు అతిక్రమిస్తే భవిష్యత్తులో ఎదురయ్యే ఇబ్బందులను వివరించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, ఏఆర్ డీఎస్పీ రంగానాయక్, ఆర్ఐలు, తదితర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న కేసులు త్వరగా పరిష్కరించాలి

హవేళిఘణపూర్, జూన్ 17;(ఆంధ్రజ్యోతి): పోలీస్ స్టేషన్‌లో పెండింగ్ కేసులు త్వరగా పరిష్కరించాలని మెదక్ జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారులతో మర్యాదగా మెలగాలని, గ్రామాల్లో చోరీలు జరగకుండా ఉండేందుకు పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. ప్రజలు పల్లెల్లో అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. రైతులు పోలాల వద్ద గొడవలు పెట్టుకోవద్దని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి ఎస్సై సత్యనారాయణ, సిబ్బంది ఉన్నారు.

వ్యవసాయశాఖ వల్ల రైతు భరోసా నష్టపోయా..

శివ్వంపేట, జూన్ 17(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ సిబ్బంది నిర్లక్ష్యానికి రైతు బంధు కోల్పోయినని మండలంలోని బిజిలీపూర్ గ్రామానికి చెందిన ఓ రైతు నిరసన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని బిజిలీపూర్ గ్రామానికి చెందిన రైతు హనుమంతు రవి ఎకరా 20 గుంటల వరి సాగు చేశాడు. వ్యవసాయ విస్తీర్ణ అధికారి ఫీల్డ్ సర్వే వెళ్లకుండా ఈ భూమిలో వరి సాగులో లేనట్టుగా నమోదు చేశారని ఏఈవో నిర్లక్ష్యానికి రైతు భరోసా నష్టపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు న్యాయం చేయాలని రైతు హనుమంతు కోరుతున్నారు. ఈ విషయమై ఏవో లావణ్యను సంప్రదించగా రైతు పంట సాగు అప్డేట్ చేసుకోకపోవడంతో రైతు భరోసా నష్టపోయారని తెలిపారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

సంగారెడ్డి క్రైం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. భవానీ చంద్ర మంగళవారం తీర్పు చెప్పారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపిన వివరాల ప్రకారం, జిన్నారం మండలం మాదారం గ్రామానికి చెందిన మంగలి బాబు (26) మద్యానికి బానిసై అదే గ్రామానికి చెందిన రాములమ్మను నానా రకాలుగా దూషించేవాడు. 2021 నవంబరు 19న ఈ విషయంలో రాములమ్మ కొడుకైన భాస్కర్, మంగలి బాబుల మధ్య గొడవ జరిగింది. దీంతో భాస్కర్.. బాబును మందు సీసాతో గొంతుపై, కడుపులో పొడిచి హత్య చేశాడు. ఈ మేరకు బొల్లారం పోలీసులు కేసు దర్యాప్తు చేసి ఆధారాలను కోర్టులో సమర్పించారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన అనంతరం నేరం రుజువు రావడంతో నిందితుడు మంగలి భాస్కర్‌కు జీవిత ఖైదు శిక్ష , రూ.500 జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసులు ప్రశాంత్, రవీందర్‌రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ శైలజ, అశోక్, రాజశేఖర్, కె.సత్యనారాయణలను జిల్లా ఎస్పీ పంకజ్ అభినందించారు.

అదుపుతప్పి బోల్తాపడ్డ ట్రాక్టర్..

● రైతుకు తప్పిన ప్రాణాపాయం



బోల్తా పడ్డ ట్రాక్టర్

శివ్వంపేట్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ బోల్తా పడి ఓ రైతుకు ప్రాణాపాయం తప్పింది. ఈ ఘటన శివ్వంపేటలో మంగళవారం జరిగింది.. బాధిత రైతు స్థానికులు తెలిపే వివరాలు మేరకు మండల కేంద్రానికి చెందిన శ్రీను రైతు తమ ట్రాక్టర్ కల్టివేటర్‌తో మడుగు పొలంలో దున్నేందుకు బురద బాట రోడ్డున వెళ్తున్నాడు. ప్రమాదవశాత్తు ట్రాక్టర్ అదుపుతప్పి రోడ్డు కింద పొలంలో బోల్తా పడటంతో రైతు మల్లేష్ డ్రైవింగ్ సీట్‌లో ఇరుక్కోగా వెంటనే స్థానికులు జేసీపీ సహాయంతో వెలికితీశారు. తలకు చేయికి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. దీంతో బాధిత రైతుకు ప్రాణాపాయం తప్పింది.

'రైతుపై దాడికి పాల్పడిన వారిని అరెస్ట్ చేయాలి'

నిజాంపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : దళిత రైతుపై దాడికి పాల్పడిన నిందితుడిని అరెస్టు చేయాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని బచ్చురాజుపల్లి గ్రామానికి చెందిన రైతు గాజులపల్లి స్వామిపై ఇటీవల దాడిచేయగా మంగళవారం స్వామిని కలిసి వివరాలు సేకరించారు. తిప్పనగుళ్ల గ్రామ శివారులో గల సర్వేనెంబర్ 163, 164లో 3 ఎకరాల 30 గుంటల భూమిని 40 సంవత్సరాల క్రితం బీసీ వర్గానికి చెందిన ఇద్దరు రైతుల వద్ద కొనుగోలు చేయగా.. నాటి నుంచి దళిత రైతులు సాగు చేసుకుంటూ జీవిస్తున్నారన్నారు. ఈ భూమికి సంబంధించిన పట్టా సైతం ప్రభుత్వం జారీ చేసిందన్నారు. ఏడాది నుంచి సహదేవ్ అనే రైతు బెదిరింపులకు పాల్పడుతూ.. ఇటీవల దాడి చేశారన్నారు. వెంటనే అతడిని అరెస్ట్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంజీవ్, గిరిజన నాయకుడు వినోద్ బాధితుడు స్వామి, దళితులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడు మృతి

కుకునూరుపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. లకుడారం గ్రామానికి చెందిన చిరబోయిన ప్రదీప్(25) ఈ నెల 4న బైక్‌పై వస్తుండగా చిన్నకిష్టాపూర్ ఎక్స్‌రోడ్ వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనతో ప్రదీప్‌కు తీవ్రమైన గాయాలు అయ్యాయి. మరో యువకుడు స్వల్పంగా గాయపడగా, తీవ్రంగా గాయపడిన ప్రదీప్‌ను ములుగులోని ఆర్వీఎం ఆసుపత్రిలో చేర్చి అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మంగళవారం ఆస్పత్రిలో ప్రదీప్ మృతి చెందాడు.

ఆకలితో అలమటించి వ్యక్తి..



అంత్యక్రియలు చేస్తున్న గ్రామస్థులు

గజ్వేల్ రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పొట్టచేత పట్టుకొని బతకడానికి వచ్చిన వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. గ్రామ పంచాయతీ సెక్రెటరీ శ్రీకాంత్, గ్రామ యువకులు, పంచాయతీ సిబ్బంది, దాతల సహకారంతో అంత్యక్రియలు చేసిన సంఘటన సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామానికి 18 ఏళ్ల క్రితం ఆదిలాబాద్ జిల్లా సిర్పూర్ కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన స్వామి(55) గ్రామంలో ప్రైవేట్ కంపెనీకి పెయింటింగ్ వర్క్ కోసం ఇక్కడే ఉండిపోయాడు. చిన్నచిన్న పెయింటింగ్ పనులు చేసుకుంటూ జీవనం కొసాగించాడు. సంవత్సరం నుంచి అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నాడు. అనారోగ్యంతో మంగళవారం ఉదయం మృతి చెందాడు. గ్రామ ప్రజల సహకారంతో అంత్యక్రియలు పూర్తి చేశారు. మృతుడికి నా అనేవారు ఎవరూ లేరు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు..

సిద్దిపేట క్రైం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఈ సంఘటన సిద్దిపేట జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగింది. వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేటకు చెందిన బోయిని బాలయ్య (58) పట్టణంలోని లెక్చరర్స్ కాలనీలో కూరగాయలు అమ్ముతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం రైతు బజార్ నుంచి కూరగాయలు తీసుకొని వెళ్తుండగా ముస్తాబాద్ చౌరస్తాలో లారీ ఢీ కొట్టింది. దీంతో బాలయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. వన్ టౌన్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహానికి పంచనామ విధించి సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సబ్ స్టేషన్ల అభివృద్ధికి రూ. 50 కోట్లు

పాపన్నపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని విద్యుత్ సబ్ స్టేషన్ల అభివృద్ధికి రూ. 50 కోట్లు మంజూరు అయినట్లు ఎస్ఈ శంకర్ తెలిపారు. మంగళవారం ఆయన పాపన్నపేటలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో మొత్తం 125 విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉండగా, వాటి అభివృద్ధికి నిధులు వినియోగిస్తామన్నారు. జిల్లాలో గృహ, పరిశ్రమల ఉంచి నెలకు రూ. 97 కోట్ల ఆదాయం వస్తుందని, 90 శాతం బిల్లులు సకాలంలో వసూలవుతున్నాయన్నారు. వినియోగదారులు పూర్తి బిల్లులు కడితేనే మెరుగైన సేవలు అందించగలుగుతామన్నారు.

రూ.12.34 లక్షలు మంజూరు

మండల పరిధి కొడుపాక విద్యుత్ ఉపకేంద్రం ప్రహరీ, ఇతర మరమ్మతుల కోసం రూ.12.34 లక్షలు మంజూరైనట్లు విద్యుత్ నియంత్రణ మండలి సలహా సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పటోళ్ల శశిధర్ తెలిపారు. విద్యుత్ ఉపకేంద్రంలో సమస్యలు ఉండగా, సీఎండీ దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించినట్లు వివరించారు.

వెంకటాయపల్లికి సబ్ స్టేషన్

తూప్రాన్ మండలంలోని వెంకటాయపల్లి గ్రామానికి 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరైంది. వెంకటాయపల్లి శివారులోని సర్వే 61లో ఇందు కోసం 1.20 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించారు. వెంకటాయపల్లిలో రూ. 2.78 కోట్ల వ్యయంతో నిర్మించే విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రదేశాన్ని మంగళవారం విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (సివిల్) సుకుమార్ పరిశీలించారు. బుధవారం నుంచి పనులు ప్రారంభించాలని కాంట్రాక్టర్ ఫరీద్‌కు సూచించారు. కార్యక్రమంలో నాయకులు లంబ రమేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.


ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

రైతుల సంక్షేమానికి కేంద్రం కృషి

● ఎంపీ రఘునందన్‌రావు

జిన్నారం/హత్నూర, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. మంగళవారం జిన్నారం మండలం మాధారం వద్ద ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన రైతులతో ప్రత్యక్ష సంభాషణ కార్యక్రమానికి ఆయన ఎమ్మెల్సీ అంజిరెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రధాని మోదీ రైతాంగ సంక్షేమానికి ఎన్నో కార్యక్రమాలను అమలు చేసి వ్యవసాయ రంగ అభివృద్ధికి బాటలు వేస్తున్నారన్నారు. దేశాన్ని ప్రపంచంలోని అగ్రరాజ్యాలతో పోటీ పడే విధంగా అభివృద్ధి చేసిన ఘనత కేంద్ర ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కాగా, రైతుల సంక్షేమానికి అమలు చేస్తున్న పథకాలను గ్రామస్థాయి వరకు కార్యకర్తలు తీసుకెళ్లాలని ఎమ్మెల్సీ అంజిరెడ్డి సూచించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా, మండల నాయకులు ఆదెల్లి రవీందర్, ప్రతాప్‌రెడ్డి, వెంకటనర్సింహారెడ్డి, రాములు, రాజశేఖర్‌రెడ్డి, మాణిక్‌రావు, మండల శాఖ అధ్యక్షుడు జగన్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే హత్నూర మండలంలోని బోర్పట్ల గ్రామంలో ఏర్పాటు చేసిన బీజేపీ జెండాను ఎంపీ రఘునందన్‌రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలు గ్రామాలకు చెందిన కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు ఆయన సమక్షంలో బీజేపీలో చేరారు.

అంబానీ, అదానీలకు దేశ సంపదను దోచిపెడుతున్న మోదీ

● సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్.వీరయ్య


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్.వీరయ్య

సంగారెడ్డి రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మూడోసారి అధికారంలోకి వచ్చిన మోదీ దేశ సంపదను అంబానీ, అదానీలకు దోచిపెడుతున్నారని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్. వీరయ్య విమర్శించారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హిందూ మత సెంటిమెంటుతో కేంద్రంలో మోదీ ప్రభుత్వం పరిపాలన సాగిస్తోందని, కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తూ కార్మికుల పొట్టకొట్టే నిర్ణయాలు తీసుకుంటుందని ఆరోపించారు. మావోయిస్టుల పేరుతో ఆదివాసులను చంపుతున్నారని, లేబర్ కోడ్లను తీసుకువచ్చి పెట్టుబడిదారులు, కార్పొరేట్ పారిశ్రామికులను ప్రోత్సహిస్తోందన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను అటకెక్కించిందని ఎద్దేవా చేశారు. సంగారెడ్డిలో ట్రిపుల్ ఆర్ పేరుతో ప్రభుత్వం తీసుకునే భూములకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారమే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జూలై 9న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాములు, జిల్లా కార్యదర్శి జయరాజ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సాయిలు, మాణిక్యం, రాజయ్య, మల్లేశం, రాంచందర్, నర్సింహులు, సభ్యులు కృష్ణ పాల్గొన్నారు.

పట్టుబట్టింది.. సాధించింది

● ఇంటర్ సప్లిమెంటరీలో స్టేట్ రెండో ర్యాంకు


రిషికారెడ్డి

సిర్గాపూర్/కల్హేర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): తన మీద తనకు ఎంతో నమ్మకంతో పట్టుబట్టి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఇంప్రూవ్‌మెంట్ రాసి స్టేట్ రెండవ ర్యాంకు సాధించింది ఎనుగంధ రిషికారెడ్డి. సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండల పరిధిలోని పోట్‌పల్లి గ్రామానికి చెందిన ఎనుగంధ వినూత, శ్రీనివాస్ రెడ్డిల కూతురైన రిషికా రెడ్డి హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ చదువుతోంది. మార్చిలో జరిగిన సాధారణ వార్షిక పరీక్షల్లో 470 మార్కులకు గానూ 463 మార్కులు సాధించింది. ఈ మార్కులతో సంతృప్తి చెందని రిషిక సప్లిమెంటరీ పరీక్షల్లో ఇంప్రూవ్‌మెంట్ రాసింది. ఆమె నమ్మకం, కృషి ఫలించగా 470 మార్కులకు గానూ 468 మార్కులు సాధించి స్టేట్ రెండవ ర్యాంకు సాధించింది. రిషికారెడ్డిని స్థానికులు అభినందించారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో చేరికకు దరఖాస్తుల స్వీకరణ

తూప్రాన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వ క్రీడా పాఠశాలలో చేరేందుకు నేడు మండల వనరుల కేంద్రం తూప్రాన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని తూప్రాన్ ఎంఈవో డాక్టర్ పర్వతి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. 19న తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్ శివారులోని టోల్‌ప్లాజా వద్దగల తెలంగాణ గురుకుల పాఠశాల, కళాశాలలో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2016 సెప్టెంబరు ఒకటి నుంచి 2017 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలని, 4వ తరగతి చదువుతూ ఉండాలని సూచించారు. చదువుతున్న ప్రస్తుత పాఠశాల నుంచి బోనఫైడ్ సర్టిఫికెట్, స్టడీ సర్టిఫికెట్, పంచాయతీ, మున్సిపాలిటీ, తహసీల్దార్ నుంచి జారీచేసిన జనన ధ్రువీకరణ పత్రం, 3వ తరగతి మార్కుల మెమో, ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు వెంట తీసుకురావాలని పేర్కొన్నారు. మండల స్థాయిలో ప్రతిభచూపిన విద్యార్థులను జిల్లా స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు.

అయ్యో.. అమ్మకెంత కష్టం

తూప్రాన్ ఆసుపత్రిలో గైనకాలజిస్ట్‌ల కొరత

● ఇతర ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్న సిబ్బంది

● మూడో వంతుకు పడిపోయిన ప్రసవాల సంఖ్య


తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రి

తూప్రాన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రి పేరుకే పెద్ద ఆసుపత్రిగా మారింది. గైనకాలజిస్ట్ కొరతతో కాబోయే తల్లులు తీవ్ర ప్రసవ వేదనను ఎదుర్కొంటున్నారు. గతంలో నెలకు వంద వరకు ప్రసవాలు జరిగే ఈ ఆసుపత్రిలో ప్రస్తుతం వాటి సంఖ్య మూడో వంతుకు పడిపోయింది. ఆసుపత్రికి వచ్చిన గర్భిణులను ఇతర ఆసుపత్రులకు రెఫర్ చేస్తుండటంతో రోగుల కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి.

ఆసుపత్రిలో సిబ్బంది కొరత

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక చొరవతో రూ.11కోట్లతో తూప్రాన్ పట్టణంలో 50 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 2018 జనవరి 17న ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ దీనిని ప్రారంభించారు. కొంత కాలానికి తూప్రాన్ సామాజిక ఆరోగ్య కేంద్రానికి 52 పోస్టులు మంజూరయ్యాయి, అందులో 23 వైద్యుల పోస్టులు ఉన్నాయి. అయితే, ఈ పోస్టులలో పూర్తిస్థాయిలో నియామకాలు జరగకపోవడంతో ఆసుపత్రి అరకొర సిబ్బందితోనే నడుస్తోంది.

నిత్యం వందలాది మంది..

తూప్రాన్ ఆసుపత్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయి నుంచి 50 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రంగా మారడంతో రోగుల సంఖ్య పెరిగింది. ప్రతి రోజూ 450 వరకు ఓపీ రోగులు వస్తుండగా, గర్భిణులు 30 మంది వరకు పరీక్షలు చేయించుకుంటున్నారు. ప్రతి నెలా తూప్రాన్ ఆసుపత్రి ల్యాబ్‌లో 2600 మందికి, టీహబ్‌లో వెయ్యి వరకు పరీక్షలు జరుగుతున్నాయి. రోగుల సేవలు మెరుగ్గానే ఉన్నప్పటికీ, ఆసుపత్రిలో కీలకమైన గైనకాలజిస్ట్ పోస్టులు పూర్తి స్థాయిలో భర్తీ కాలేదు. సివిల్ సర్జన్, డిప్యూటీ సివిల్ సర్జన్, సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు మూడు ఉండగా, సివిల్ సర్జన్, డిప్యూటీ సివిల్ సర్జన్ పోస్టులు మాత్రమే భర్తీ అయ్యాయి. గర్భిణుల పరీక్షల సమయాల్లో మాత్రమే ఆన్ కాల్ డ్యూటీలు నిర్వహిస్తున్నారు. రాత్రి విధులు నిర్వహించాల్సిన సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టు ఖాళీగా ఉండటంతో రాత్రులలో సేవలు అందడం లేదు.

తగ్గిపోతున్న ప్రసవాల సంఖ్య

తూప్రాన్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో గైనకాలజిస్ట్‌ల సేవలు అంతంత మాత్రంగానే ఉండటంతో ప్రసవాల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. నెలకు సుమారు వంద ప్రసవాలు జరిగే ఆసుపత్రిలో ప్రస్తుతం ఈ సంఖ్య 30కి పడిపోయింది. గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించే రోజుల్లోనే గైనకాలజిస్ట్‌లు గర్భిణులకు సేవలు అందిస్తున్నారు. ఆయా రోజుల్లోనే క్లిష్టమైన ప్రసవాలు, ఆపరేషన్ ప్రసవాలు చేస్తున్నారు. మిగతా రోజుల్లో ప్రసవాలు సరైన స్థాయిలో జరగడం లేదు. చిన్నపాటి సమస్య ఉన్నా సమీపంలోని ఆసుపత్రులకు రెఫర్ చేస్తున్నారు. రాత్రులలో ప్రసవాలకు వచ్చే గర్భిణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తూప్రాన్ ఆసుపత్రికి వచ్చిన గర్భిణులను ఇతర ఆసుపత్రులకు రెఫర్ చేస్తుండటంతో రోగుల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి.

గైనకాలజిస్ట్‌లను నియమించాలి..

తూప్రాన్ ఆసుపత్రిలో గర్భిణులకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించేందుకు గైనకాలజిస్ట్‌లను నియమించాలని ప్రజలు కోరుతున్నారు. ఆసుపత్రిలో ప్రసవాలు చేయకుండా రెఫర్ చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. తూప్రాన్ ఆసుపత్రిలోనే గర్భిణులకు ప్రసవాలు, సిజేరియన్లు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. పెద్ద ఆసుపత్రిని ఏర్పాటు చేసి ప్రసవాలు చేయకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నియామకానికి చర్యలు తీసుకోవాలి..

పోస్టుల నియామకానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. కాంట్రాక్టు పద్ధతిలో నియామకానికి అనుమతి లేదు. అంతేకాకుండా డ్యూటీలు చేసేవారు లభించడం లేదు. తూప్రాన్‌తో పాటు, నర్సాపూర్ ఏరియా ఆసుపత్రిలో కూడా ఇబ్బంది ఉంది. కమిషనర్ కూడా నియామకం చేపట్టనున్నట్లు తెలిపారు.

- శివదయాళ్, డీసీహెచ్ఎస్

బీసీ బిల్లు కోసం జూలై 17న రైల్ రోకో

● 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేశాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

● తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత


మాట్లాడుతున్న కల్వకుంట్ల కవిత

మెదక్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయించిన తర్వాతే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ జాగృతి అధినేత్రి, కేసీఆర్ తనయ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. రాష్ట్రపతి వద్దనున్న బీసీ బిల్లు ఆమోదించాలని ఒత్తిడి పెంచేందుకు జూలై 17న రైల్ రోకో చేపట్టనున్నట్లు ఆమె తెలిపారు. మెదక్ జిల్లా కేంద్రంలో యునైటెడ్ పూలే ఫ్రంట్, తెలంగాణ జాగృతి సంస్థల ఆధ్వర్యంలో మంగళవారం బీసీ కుల సంఘాల నేతలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వెనుకబడిన తరగతులపై ఇంకా అగ్రకుల దురహంకారం కొనసాగుతూనే ఉందని, అందుకు మెదక్‌లో బీసీ సంఘాల ప్రతినిధులచే నిర్వహిస్తున్న రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరుకావద్దని బెదిరింపులకు గురిచేయడమే నిదర్శనమన్నారు. రాజ్యాంగం అమలులోకి వచ్చి దశాబ్దాలు గడిచినా.. ఇప్పటికీ కనీసం వార్డు మెంబర్లు కూడా కాని బీసీ కులాలు ఎన్నో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణనలో బీసీల సంఖ్య తక్కువ చూపారని అనుమానం వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద కులగణన జాబితా ప్రదర్శించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులగణనపై అసెంబ్లీలో తీర్మాణం చేసి కేంద్రానికి పంపి తమ పాత్ర పూర్తయినట్లు భావిస్తోందని, సీఎం రేవంత్ తమ ఢిల్లీ పర్యటనల్లో బీసీ రిజర్వేషన్ల అంశాన్ని ప్రస్తావించడం లేదని వాపోయారు. మెదక్ ఎంపీ రఘనందనరావు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై మౌనం వహించడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. బీసీలు 42 శాతం రిజర్వేషన్లు సాధించడానికి గళాలు విప్పాలని, తెలంగాణ రాష్ట్ర సాధన పోరాలు వంటబట్టించుకున్న బీసీలంతా ఏకతాటిపైకి వచ్చి పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. యునైటెడ్ పూలే ఫ్రంట్ కన్వీనర్ శివశంకర్ మాట్లాడుతూ బీసీ వర్గాల సంఘటిత శక్తికి రాజకీయ పార్టీలకు మింగుడుపడడం లేదని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాలతో పాటు మిగతా జిల్లాల నుండీ బీసీలు హాజరయ్యారు.

దూరంగా బీఆర్‌ఎస్ శ్రేణులు..

ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి బీఆర్ఎస్ శ్రేణులు మాత్రం దూరంగా ఉన్నాయి. జిల్లా కేంద్రంలో ఉన్న వందలాది మంది బీఆర్ఎస్ కార్యకర్తలు సమావేశం దరిదాపులకు కూడా వెళ్లలేదు. ఎమ్మెల్సీ కవిత మాత్రం తన ప్రసంగంలో పలుమార్లు కేసీఆర్ ప్రస్తావన తెచ్చినప్పటికీ ఆ పార్టీ కార్యకర్తలు మాత్రం రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొనకపోవడంతో జాగృతి సమావేశాలకు వెళ్లవద్దని అంతర్గతంగా ఆదేశాలు వచ్చాయని పలువురు భావిస్తున్నారు.

దాడి చేసిన దుండగులను అరెస్టు చేయాలి

● ఏబీవీపీ జాతీయ కార్యదర్శి శ్రవణ్‌రాజ్

సిద్దిపేట క్రైం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి నాయకుడిపై పదునైన ఆయుధాలతో హత్యాయత్నం చేసిన రాజ్యాంగ వ్యతిరేక గూండాలను వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ జాతీయ కార్యదర్శి శ్రవణ్ బి.రాజ్ డిమాండ్ చేశారు. మంగళవారం సిద్దిపేట అంబేద్కర్ చౌరస్తాలో ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. నిత్యం విద్యారంగ సమస్యలపై, దేశ సమస్యలపై, సామాజిక సమస్యలపై పోరాటం చేసే ఏబీవీపీ సిద్దిపేట జిల్లా కన్వీనర్ సావుల ఆదిత్యపై రాజ్యాంగ వ్యతిరేక గూండాలు దాడి చేయడం బాధాకరం అన్నారు. కొన్ని దుష్ట శక్తులకు మొదటి నుంచి రాజ్యాంగం పైన, ప్రజాస్వామ్యం పైన నమ్మకం లేదన్నారు. ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఆదిత్య రాజ్యాంగ వ్యతిరేక శక్తుల చర్యలను ప్రశ్నించినందుకు ఆయనపై పదునైన ఆయుధాలతో హత్యాయత్నం చేయడం దారుణం అన్నారు. కార్యకర్తలకు ఏబీవీపీ రాష్ట్ర శాఖ అండగా ఉంటుందన్నారు. మంత్రి ఇలాకాలో ఇలా జరిగిన కూడా స్పందించకపోవడం సిగ్గుమాలిన చర్యగా భావిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు, రాష్ట్ర కార్య సమితి సభ్యుడు వివేక్, రాష్ట్ర హాస్టల్ కో కన్వీనర్ పవన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఫణీంద్ర, నగర కార్యదర్శులు పర్శరామ్, చరణ్, రాజ్, రాకేష్, రాహుల్, వసంత, రాజేష్, మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు


చిన్నారికి అక్షరాభ్యాసం చేయిస్తున్న మాతా శిశు సంక్షేమ శాఖ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ లలిత కుమారి

'అంగన్‌వాడీ కేంద్రాలతో శారీరక, మానసిక వికాసం'

కోహీర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలు పిల్లల శారీరక, మానసిక వికాసానికి దోహదపడతాయని మాతా శిశు సంక్షేమ శాఖ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ లలిత కుమారి అన్నారు. మంగళవారం కోహీర్ మండల కేంద్రంలోని లాలకుంట ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహించిన 'అమ్మ మాట-అంగన్‌వాడీ బాట' ముగింపు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలో రెండున్నర సంవత్సరాలు వయస్సు దాటిన 9,937 మంది చిన్నారులను ఆయా అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పినట్లు పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు పోషకాహారంతో పాటు ఆటపాటలతో కూడిన విద్యాబోధన అందుతుందన్నారు. అంతేకాకుండా, గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాలలో బలవర్ధకమైన ఆహారాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం ప్రాజెక్టు డైరెక్టర్ లలితకుమారి చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో సీడీపీఓ అంజమ్మ, సూపర్‌వైజర్ తులసి, సునీత, మేరీ గ్రేసీ, రాధ, సద్గుణ, పల్లవి, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

ఇంట్రా లీగ్ మ్యాచ్‌లో సంగారెడ్డి విజయం


విజయం సాధించిన సంగారెడ్డి జట్టు

సంగారెడ్డి అర్బన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిద్దిపేటలోని ప్రొఫెసర్ జయశంకర్ మినీ స్టేడియంలో మంగళవారం జరిగిన అండర్-19 ఇంట్రా డిస్ట్రిక్ట్ క్రికెట్ లీగ్ మ్యాచ్‌లో సంగారెడ్డి జట్టు విజయం సాధించింది. సంగారెడ్డి రెడ్, సిద్దిపేట పింక్ జట్ల మధ్య జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన సంగారెడ్డి రెడ్ జట్టు 49.5 ఓవర్లలో 229 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. అనంతరం బ్యాటింగ్ చేసిన సిద్దిపేట పింక్ జట్టు 29 ఓవర్లలో 123 పరుగులకు ఆలౌట్ కావడంతో, సంగారెడ్డి రెడ్ జట్టు 106 పరుగుల తేడాతో విజయం సాధించిందని ఉమ్మడి జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి రాజేందర్‌రెడ్డి తెలిపారు.

సమష్టి కృషితోనే ఆర్టీసీకి లాభాలు

● సంస్థ ఈడీ ఖుస్రోషాఖాన్


మొక్క నాటి నీళ్లు పోస్తున్న ఖుస్రోషాఖాన్

జహీరాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, కార్మికుల సమష్టి కృషితోనే ఆర్టీసీ లాభాల బాటలో పయనిస్తుందని ఆర్టీసీ ఈడీ ఖుస్రోషాఖాన్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన జహీరాబాద్ పట్టణంలోని ఆర్టీసీ డిపోను సందర్శించి తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏడాది కాలంగా కార్మికులు, ఉద్యోగులు అంకితభావంతో పనిచేయడం వల్లే సంస్థ లాభాలవైపు మళ్లిందని, ఇదే స్ఫూర్తితో పనిచేస్తే రెండేళ్లలో కార్మికుల కష్టాలు దూరమవుతాయన్నారు. జహీరాబాద్ డిపోకు కొత్త బస్సులు వచ్చేలా కృషిచేస్తామన్నారు. ఆర్టీసీలో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు తమవంతు బాధ్యతగా కృషి చేస్తామన్నారు. ప్రయాణీకుల పట్ల ఉద్యోగులు మర్యాదపూర్వకంగా నడుచుకోవాలన్నారు. అనంతరం ఆర్టీసీ డిపోలో మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

'ఆపరేషన్ సిందూర్' జవాన్‌కు సన్మానం


జవాన్‌కు సెల్యూట్ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

శివ్వంపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్ద గొట్టిముక్ల గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ సింగిరెడ్డి మధుసూదన్‌రెడ్డి ఇటీవల నిర్వహించిన ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్నారు. మంగళవారం స్వగ్రామానికి రావడంతో ఆయనకు గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. జడ్పీహెచ్ఎస్ అనంత పాఠశాలలో జవాన్‌ను ఘనంగా సన్మానించారు. మాజీ ఉప సర్పంచ్ నవీన్, మురళీధర్ రెడ్డి పాల్గొన్నారు.

అర్హత టెన్త్.. ఉపాధి మస్త్..

● ఏటీసీ(అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కోర్సులు)తో ఉద్యోగావకాశాలు

● కుకునూరుపల్లి ఐటీఐ కళాశాలలో ప్రారంభం

● అందుబాటులో ఆరు కోర్సులు.. ఉచిత అడ్మిషన్లు



ఉచిత అడ్మిషన్లు

కుకునూరుపల్లి ఐటీఐ కళాశాలలో చేరడానికి విద్యార్థులు తమ ధ్రువపత్రాలతో నేరుగా కళాశాలను సంప్రదిస్తే, సిబ్బంది ఉచితంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి అడ్మిషన్లు ఇస్తారు. కళాశాల బోధనా బృందం ఇప్పటికే గజ్వేల్ నియోజకవర్గంలోని అన్ని మండలాల ఎంఈఓలను కలిసి విద్యార్థులను ఐటీఐలో చేర్పించేలా కృషి చేయాలని కోరింది. దీంతో పాటు వివిధ విద్యా సంస్థలు, సోషల్ మీడియా, కరపత్రాల ద్వారా విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని కళాశాల యాజమాన్యం కోరుతోంది.

కుకునూరుపల్లి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం, భవిష్యత్తులో కేవలం హార్డ్‌వర్క్ కంటే స్మార్ట్ వర్క్ నైపుణ్యాలకే ఎక్కువ ప్రాధాన్యత లభిస్తోంది. డిగ్రీలు, పీజీలు అవసరం లేకుండానే పదవ తరగతి అర్హతతో అద్భుతమైన భవిష్యత్తును సొంతం చేసుకునే అవకాశాలను కుకునూరుపల్లి ఐటీఐ కళాశాల అందిస్తోంది. టాటా కంపెనీ సౌజన్యంతో ఈ కళాశాలలో నూతనంగా ప్రారంభమైన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ) ద్వారా విద్యార్థులు తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవచ్చు. అత్యాధునిక పరికరాలు, నిష్ణాతులైన ఉపాధ్యాయ బృందంతో ఈ సంవత్సరం ఏటీసీలో ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. దీంతో పాటు ఎలక్ట్రీషియన్, డీజిల్ మెకానిక్, వెల్డర్ కోర్సులలో ప్రవేశాలకు కూడా దరఖాస్తులు కోరుతున్నారు.

భవిష్యత్తు అంతా ఏటీసీదే

ప్రస్తుత కాలంలో మనిషి ప్రమేయం లేకుండానే వివిధ పరికరాలు, అధునాతన మిషన్లతో పనులు వేగంగా పూర్తవుతున్నాయి. పెయింటింగ్, ఎలక్ట్రిక్ వెహికిల్ నైపుణ్యం, కళాకృతుల తయారీ, ఎలక్ట్రిక్ వెహికిల్ బ్యాటరీ నైపుణ్యం, కంప్యూటర్ నియంత్రిత ఉత్పత్తి వంటి ఎన్నో నైపుణ్యాలను ఏటీసీ అందిస్తుంది. ఈ కోర్సులలో చేరిన విద్యార్థులు తమ ప్రతిభను పెంచుకొని ఉద్యోగ, ఉపాధి రంగాలలో స్థిరపడవచ్చు. భవిష్యత్తులో పనులు పూర్తిగా రోబోలు, పరికరాలతో జరిగినా ఆశ్చర్యపోనవసరం లేదు కాబట్టి, ఏటీసీ విభాగంలో ఏ కోర్సు పూర్తి చేసినా భవిష్యత్తుకు భరోసా లభిస్తుంది.

ఆరు కోర్సులలో ఒక్కొక్క విభాగానికి 24 నుంచి 40 వరకు సీట్లు అందుబాటులో ఉన్నాయి. మూడు కోర్సులు ఒక సంవత్సరంలో, మరో మూడు కోర్సులు రెండు సంవత్సరాలలో పూర్తి చేయవచ్చు. కోర్సు పూర్తయిన తర్వాత జాతీయ, అంతర్జాతీయ పరిశ్రమలలో మంచి జీతాలతో ఉద్యోగాలు పొందవచ్చు లేదా సొంతంగా ఉపాధిని కూడా సృష్టించుకోవచ్చు. ఏటీసీ విభాగంలో విద్యార్థులకు బోధించడానికి ఇద్దరు మాస్టర్ ట్రైనర్లు, ఆరుగురు ఇన్‌స్ట్రక్టర్లు అందుబాటులో ఉన్నారు.

కోర్సులివే..

- మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికిల్
- అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మెకానిక్ టెక్నీషియన్
- బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైడ్
- ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్
- మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేటిక్
- ఆర్టిఫిషియల్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్


విద్యార్థులకు రోబోటిక్ విద్య బోధిస్తున్న ఇన్‌స్ట్రక్టర్

న్యూస్ బాక్స్

మంత్రిని కలిసిన చిన్నాముదిరాజ్

రామచంద్రాపురం టౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చిన్నాముదిరాజ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అరుణ్‌గౌడ్, ఓబీసీ విభాగం జిల్లా చైర్మన్ మవీన్‌గౌడ్ మంత్రి వివేక్ వెంకటస్వామి కలిశారు. మంగళవారం హైదరాబాద్‌లో టీఎస్ఐఐసీ చైర్మన్ నిర్మలాజగ్గారెడ్డితో కలిసి మంత్రికి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని వివరించారు.

ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

చిన్నశంకరంపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని పల్లె దవాఖానా వైద్యాధికారి డాక్టర్ హారిక అన్నారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తగా మంగళవారం ఎస్టీ హాస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మాట్లారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 21 వరకు అన్ని వసతి గృహాల్లోని విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు. అలాగే మండలంలోని వైద్యాధికారి డాక్టర్ సాయిసింధు ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై సూచనలు

చిన్నశంకరంపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట మండలంలోని గవ్వపల్లి, అగ్రహారం తదితర గ్రామాల్లో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంగళవారం ఇంటి నిర్మాణం నిబంధనలపై హౌజింగ్ ఏఈ లోకేష్ కుమార్ పలు సూచనలు కల్పించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్మాణం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల్లో అవకతవకలకు పాల్పడొద్దు

శివ్వంపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : ఉపాధిహామీ పనుల్లో అవకతవకలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, ఉపాధిహామీ కూలీల డబ్బులు ఆలస్యం అవ్వకుండా ఖాతాల్లో వేసేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధిలోని పెద్దగొట్టి ముక్క గ్రామంలో ఉపాధిహామీ పథకంలో చేపడుతున్న పనులు, ఫిష్ పాండ్, పశువుల షెడ్డు పనులను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

నైబర్‌హుడ్ కేంద్రంతో భవితకేంద్రం అనుసంధానం

నారాయణఖేడ్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్‌లోని భవిత కేంద్రాన్ని నైబర్ హుడ్ కేంద్రంతో అనుసంధానం చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు డీఆర్డీఏ ఆధ్వర్యంలో దివ్యాంగుల సేవాకేంద్రం, సమగ్రశిక్ష ద్వారా సేవలను విస్తరించామని జిల్లా విద్యాశాఖ సమగ్ర శిక్షా విలీన విద్య సమన్వయకర్త వెంకటేశం తెలిపారు. బడిబాటలో భాగంగా నారాయణఖేడ్‌లోని భవిత కేంద్రంలో మంగళవారం సమ్మిలిత విద్యా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై సేవలను పరిశీలించారు.

అధిక ధరలు వసూలు చేస్తే క్రిమినల్ కేసులు

సంగారెడ్డి రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : మీ సేవ కేంద్రాల్లో ప్రజల నుంచి అధిక ధరలు వసూలు చేస్తే నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సంగారెడ్డి తహసీల్దార్ జయరామ్ నాయక్ హెచ్చరించారు. సంగారెడ్డిలోని కల్పకుంట రోడ్డులో గల మీ సేవ కేంద్రాల్లో మంగళవారం తహసీల్దార్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, మాట్లాడారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని, ప్రభుత్వం నిర్ధయించిన ధరలను మాత్రమే తీసుకోవాలని సూచించారు.

ఫిజిక్స్ గెస్ట్ లెక్చరర్ కోసం దరఖాస్తుల స్వీకరణ

తూప్రాన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్ శివారులోని టోల్‌ప్లాజా వద్దగల తెలంగాణ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో ఫిజిక్స్ గెస్ట్ లెక్చరర్‌గా పనిచేసేందుకు అర్హులైన అధ్యాపకుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తారాసింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ కళాశాలలో ఫిజిక్స్ బోధించేందుకు అర్హులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. వివరాలకు ప్రిన్సిపాల్ 8688665770ను సంప్రదించాలని సూచించారు.

19న క్రీడా పాఠశాల ఎంపిక ప్రక్రియ

మాసాయిపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 19న హకీంపేటలోని క్రీడా పాఠశాలలో 4వ తరగతిలో ప్రవేశాలకు ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు ఎంఈవో లీలావతి ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలో నిర్వహించే ఎంపికకు విద్యార్థులు హాజరుకావాలని తెలిపారు. 19న ఉన్నత పాఠశాలలో ఉదయం 9 గంటలకు ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆధార్‌కార్డులను అప్‌డేట్ చేసుకోవాలి

- జూలై నుంచి స్పెషల్ డ్రైవ్
- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : పదేళ్ల వ్యవధి దాటిన ఆధార్‌కార్డులను స్పెషల్ డ్రైవ్ ద్వారా అప్‌డేట్ చేసుకోవాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆధార్‌కార్డును అప్‌డేట్ చేసుకోవడం ద్వారా పలు ప్రయోజనాలు పొందవచ్చన్నారు. వివిధ ప్రభుత్వ పథకాలకు, బ్యాంకు సేవలకు ఆటంకాలు లేకుండా ఉండేందుకు పదేళ్ల క్రితం ఆధార్ పొందిన ప్రతిఒక్కరూ తప్పనిసరిగా నవీకరించుకోవాలన్నారు. పేరు. పుట్టినతేదీ, చిరునామా తదితర వివరాలతో కూడిన ధ్రువీకరణ పత్రాలు సమర్పించి సమీపంలోని ఆధార్ కేంద్రాల్లో అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. 5-15 ఏళ్లలోపు గలవారు తప్పనిసరిగా బయోమెట్రిక్ అప్‌డేట్ చేయించకోవాలన్నారు. ఆధార్ అప్‌డేట్ కానీ ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ పిల్లల వివరాలను తయారు చేయాలన్నారు. జూలై నుంచి స్పెషల్ డ్రైవ్ ద్వారా ఆధార్ ఎనోరోల్‌మెంట్, బర్త్ సర్టిఫికెట్‌కు సంబంధించి సమగ్ర ప్రణాళిక ద్వారా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, అదనపు ఎస్పీ మహేందర్, డీఆర్వో భుజంగరావు, డీఈవో రాధాకిషన్, డీఎంహెచ్‌వో డా.శ్రీరామ్, సంక్షేమాధికారి హైమావతి, డీపీవో యాదయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గదుల కొరత సమస్య పరిష్కరించిన కలెక్టర్

శివ్వంపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గదుల కొరతతో ఇబ్బందిపడుతున్న విషయాన్ని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి మాధవి ద్వారా తెలుసుకున్న కలెక్టర్ రాహుల్‌రాజ్.. ఇటీవల కళాశాలను స్వయంగా పర్యవేక్షించారు. ప్రభుత్వ పాఠశాలలోని మూడు గదులను వెంటనే కళాశాలకు కేటాయించాలని హెచ్ఎం బాలచంద్రంకు ఆదేశాలిచ్చారు. గదుల సమస్యను పరిష్కరించడంతో కలెక్టర్‌కు, ఇంటర్మీడియట్ జిల్లా అధికారి మాధవికి, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

రూ.11 కోట్లతో నూతన విద్యుత్ స్తంభాలు

- త్వరలో రెండు నూతన సబ్‌స్టేషన్లకు శంకుస్థాపన
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : పటాన్‌చెరు నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో రూ.11 కోట్లతో నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గంలోని గ్రామాలు, మున్సిపాలిటీలు, జీహెచ్ఎంసీ డివిజన్లలో ఇనుప స్తంభాల స్థానంలో సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేయాలని సంకల్పించామన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలో రూ.2 కోట్లు, ఇస్నాపూర్, కొల్లూరు సబ్‌స్టేషన్ల పరిధిలో రూ.9 కోట్లతో అంచనాలు రూపొందించామన్నారు. గత వేసవిలో విద్యుత్ సిబ్బంది అద్భుతంగా పనిచేసిందన్నారు. త్వరలోనే అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని చక్రపురి, బీరంగూడా గోశాల, రామచంద్రాపురం మండల పరిషత్ ఆవరణలో రూ.15 కోట్లతో నిర్మించిన 33ౖ11 కేవీ సబ్‌స్టేషన్లను ప్రారంభిస్తున్నామని చెప్పారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని సింపనీకాలనీ, పోచారం సబ్‌స్టేషన్లకు నిధులు మంజూరైనందున త్వరలోనే శంకుస్థాపన చేస్తామన్నారు.

బస్తీల్లో మురుగు సమస్యలకు పరిష్కారం



పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ పుష్పానగేష్

రామచంద్రాపురం టౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : బస్తీల్లో మురుగు సమస్యలకు శాశ్వత పరిష్కారం చేసే విధంగా కృషి చేస్తున్నామని కార్పొరేటర్ పుష్పానగేష్ చెప్పారు. మంగళవారం రామచంద్రాపురం డివిజన్ పరిధి శ్రీనివాస్‌నగర్‌లో రూ.25 లక్షల అంచనాతో జరుగుతున్న మురుగు పైపులైన్ నిర్మాణ పనులు మంగళవారం జలమండలి డీజీఎం శివకృష్ణ, మేనేజర్ లోకేష్‌తో కలిసి పరిశీలించి మాట్లాడారు. పైపులైన్ నిర్మాణ పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పైపులైన్ వేసిన తరువాత సీసీరోడ్డు పనులు చేపట్టాల్సి ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు పీటర్, సామ్రాట్, హబీబ్, శ్రీకాంత్‌నాయక్, మల్లేష్, నవీన్‌యాదవ్, హనుమంతు, రమేష్, సత్తెయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- మెదక్ జడ్పీ సీఈవో ఎల్లయ్య



చేగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎల్లయ్య

చేగుంట/చిన్నశంకరంపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులకు మెదక్ జడ్పీ సీఈవో ఎల్లయ్య సూచించారు. మంగళవారం చేగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం పాఠశాల స్థితిగతులపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకుని మాట్లాడారు. చేగుంట ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 90 మంది విద్యార్థుల్లో 25 మంది విద్యార్థులు 500లకు పైగా మార్కులు సాధించడం పట్ల ఆయన ఉపాధ్యాయులను అభినందించారు. ఆయన వెంట ఎంపీడీవో చిన్నారెడ్డి, ఎంఈవో నీరజ, ఎంపీవో ప్రశాంత్, పంచాయతీ కార్యదర్శి నరేష్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు. గ్రామాల పరిశుభ్రతపై దృష్టిసారించాలని మెదక్ జడ్పీ సీఈవో ఎల్లయ్య ఎంపీడీవో దామోదర్‌కు సూచించారు. మంగళవారం చిన్నశంకరంపేట మండల పరిషత్ కార్యాలయాన్ని అకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లోని వీధులను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం కార్యాలయానికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు.

హిందీ, ఉర్దూభాషల్లో బోర్డుపై పేర్లెందుకు రాయలేదు

- అధికారులను నిలదీసిన స్థానిక నాయకులు



పట్టణంలోని మొగుడంపల్లి చౌరస్తా వద్ద అధికారులను ప్రశ్నిస్తున్న స్థానిక నాయకులు

జహీరాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ పట్టణంలో నిర్మితమైన ఫ్లైఓవర్ బ్రిడ్జిపై వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు వీలుగా మార్గాలను చూపుతూ ఏర్పాటుచేసిన బోర్డుపై ఉర్దూ, హిందీ, ఉర్దూభాషల్లో పేర్లెందుకు రాయలేదని ఎంఐఎం నియోజకవర్గ అధ్యక్షులడు అత్తర్‌అహ్మద్, పలువురు మైనార్టీ నాయకులు ఆర్‌అండ్‌బీ అధికారులను మంగళవారం నిలదీశారు. ముందుగా వారంతా బోర్డు ఏర్పాటు చేసే ప్రాంతంలో పోగై ఆందోళనకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న పట్టణ ఎస్ఐ వినయ్‌కుమార్, సంగమేశ్వర్ సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులను వారింపజేశారు. ఈ సందర్భంగా పలువురు మైనార్టీ నాయకులు మాట్లాడుతూ బోర్డుపై ఉర్దూ, హిందీలో వివిధ ప్రాంతాల పేర్లను రాకపోవడమేంటని ప్రశ్నించారు. ముఖ్యంగా జహీరాబాద్, కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల్లో ఉర్దూ, హిందీభాష ప్రాబల్యంలో ఉందనే విషయాన్ని అధికారులు గ్రహించకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. బోర్డుపై ఉర్దులో పేర్లను రాయాలంటూ పట్టుబట్టారు. సంబంధిత ఆర్‌అండ్‌బీ ఏఈ సంధ్య, అధికారులు స్పందించి బోర్డుపై ఉర్దూ, హిందీలో పేర్లను రాస్తమని చెప్పడంతో ఆందోళనకారులు ఆందోళనను విరమించారు.

దివ్యాంగులకు ర్యాంపులు ఏర్పాటు చేయాలి

- వెన్నెముక గాయ దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు షఫీ అహ్మద్



ఎస్పీ పంకజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న వెన్నెముక గాయ దివ్యాంగుల సంఘం నాయకులు

సంగారెడ్డి క్రైం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : వెన్నెముక జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్లలో దివ్యాంగుల సౌకర్యార్థం ర్యాంపులు ఏర్పాటు చేయాలని వెన్నెముక గాయ వికలాంగుల సంఘం అధ్యక్షుడు ఎండీ.షఫీ అహ్మద్‌ఖాన్ కోరారు. ఈ విషయమై మంగళవారం ఎస్పీ పరితోష్ పంకజ్‌కు వినతిపత్రం సమర్పించి మాట్లాడారు. అన్ని పోలీస్‌స్టేషన్లలో వీల్ చైర్ దివ్యాంగుల కోసం ర్యాంపులు ఏర్పాటు చేయాలని, ఇతర ప్రవేశ సౌకర్యాలను కల్పించాలన్నారు. దివ్యాంగుల చట్టాల గురించి పోలీసు సిబ్బందికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, వికలాంగుల, వృద్ధుల హక్కులపై అవగాహన పోస్టర్లను అన్ని పోలీస్‌స్టేషన్లలో ప్రదర్శించాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో సంఘం నాయకులు రామ్‌శెట్టి, మహేష్‌కుమార్, వెంకట్, నవభారత్ పోచయ్య, డి.ప్రవీణ తదితరులు ఉన్నారు.

చదువుతోనే భవిష్యత్ : ఎంఈవో

చిన్నశంకరంపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : బడి ఈడు పిల్లలకు చదువుతో భవిష్యత్ ఉంటుందని ఎంఈవో పుష్పవేణి అన్నారు. మంగళవారం బడిబాట ముగింపులో భాగంగా చిన్నశంకరంపేట మండల కేంద్రంతో పాటు మిర్జాపల్లి, సూరారం, మడూర్, శాలిపేట తదితర గ్రామాలో మధ్యలో చదువు మానేసిన పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు. అలాగే చిన్నశంకరంపేట మండలంలోని మిర్జాపల్లి హైస్కూల్‌లో దివ్యాంగ విద్యార్థులకు ఎంఈవో ఫిజియోథెరపీ చేశారు.

చిన్నారుల భవిష్యత్.. అంగన్‌వాడీ కేంద్రమే

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజమ్మ



కొర్విపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్

చిన్నశంకరంపేట/వెల్దుర్తి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : చిన్నారులకు భవిష్యత్.. అంగన్‌వాడీ కేంద్రమేనని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజమ్మ అన్నారు. 'అమ్మమాట- అంగన్‌వాడీ బాట' ముగింపులో భాగంగా చిన్నశంకరంపేట మండలం కొర్విపల్లి గ్రామంలో మంగళవారం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించి మాట్లాడారు. రెండేళ్ల నుంచి ఐదేళ్ల చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. అలాగే వెల్దుర్తి మండలంలోని శేరి అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి ఆధ్వర్యంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు, అన్నప్రాసన నిర్వహించారు.

భూ సమస్యల సత్వర పరిష్కారానికి కృషి



దిగ్వాల్ గ్రామంలో అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో రాంరెడ్డి

కోహీర్/శివ్వంపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : రైతుల భూ సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తామని జహీరాబాద్ ఆర్డీవో రాంరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కోహీర్ మండలం దిగ్వాల్ గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆర్డీవో పాల్గొని మాట్లాడారు. భూ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ సదస్సులను నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాంలింగారెడ్డి పాల్గొన్నారు. శివ్వంపేట మండలం గోమారంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సును ఆర్డీవో మైపాల్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కమలాద్రి, డిప్యూటీ తహసీల్దార్ షఫీయొద్దీన్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలను అమ్మితే కఠిన చర్యలు

- మెదక్ జిల్లా వ్యవసాయ అధికారి హెచ్చరిక



విత్తనాల దుకాణాలను తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి వినయ్‌కుమార్

మాసాయిపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : నకిలీ విత్తనాలను అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి విన్సెంట్ వినయ్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం మాసాయిపేట మండల కేంద్రంలోని రైతువేదికను, మండల వ్యవసాయ అధికారి కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి, మాట్లాడారు. విత్తన దుకాణదారులు రైతులకు నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్‌గౌడ్, విస్తరణాధికారి రజిత, సొసైటీ డైరెక్టర్ నర్సింలు పాల్గొన్నారు

ఎరువుల తరలిస్తే కేసులు

కంగ్టి/నర్సాపూర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : పక్క రాష్ట్రాలకు ఎరువుల తరలించే దుకాణాలపై కేసులు నమోదు చేస్తామని ఏడీఏ నూతన్‌కుమార్ హెచ్చరించారు. ఈనెల 14న 'ఇటు నుంచి అటు, అటు నుంచి ఇటు' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో వార్త ప్రచురితం కావడంతో ఏడీఏ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాకు రికార్డులు, బిల్ బుక్కులు, నగదు రశీదులు పరిశీలించారు. అలాగే నర్సాపూర్‌లో మంగళవారం పలు విత్తన విక్రయ దుకాణాలను వ్యవసాయ మండల అధికారి దీపికి ఆకస్మికంగా తనిఖీ చేశారు.

సమస్యలతో సతమతం.. రోగులకు శాపం

5వ పేజీ తరువాయి

పడుతున్నారు. ఈ కారణంగా పలు సర్కారు ఆస్పత్రుల్లో సర్జరీలు కూడా వాయిదా వేసే పరిస్థితి వచ్చిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీజనల్ కాలం ప్రారంభం కావడంతో పరిస్థితి మరింత తీవ్రంగా మరే అవకాశం లేకపోలేదు.

కు.ని.కి పాట్లు

జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఏరియా ఆస్పత్రుల్లో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు (ఫ్యామిలీ ప్లానింగ్) పూర్తిస్థాయిలో జరగడం లేదు. కు.ని.ఆపరేషన్లు చేసేందుకు ఏరియా ఆస్పత్రుల్లో నిపుణులైన వైద్యులు, సౌకర్యాలు ఉన్నా ఆపరేషన్లు నిర్వహించడం లేదు. జిల్లా వైద్యాధికారులు పర్యవేక్షణ, నిర్లక్ష్యం కారణంగా ట్యుబెక్టమీ, వేసెక్టమీ ఆపరేషన్లు మొక్కుబడిగా అరకొరగా నిర్వహిస్తున్నారు. ఇక డీపీఎల్ క్యాంపుల నిర్వహణ ఐదేళ్లుగా నిలిచిపోయింది. సంగారెడ్డిలోని ఎంసీహెచ్ తప్ప మిగతా ఏ సర్కారు దవాఖానాలో పూర్తిస్థాయిలో కు.ని. ఆపరేషన్లు చేయడం లేదు. ఫలితంగా ఎంసీహెచ్‌పైనే తీవ్ర భారం పడుతున్నది. జిల్లాలోని పలుచోట్ల ప్రైవేటు ఆస్పత్రుల్లో కు.ని. ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు. కానీ అవి కూడా తామే నిర్వహించామని పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రుల గణాంకాల్లో ఆ శాఖ అధికారులు పేర్కొనడం గమనార్హం.

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖతో పాటు వైద్య విధాన పరిషత్ ఆస్పతుల్లో డిప్యూటేషన్ల పర్వం గుట్టుగా సాగిస్తున్నారనే ఆరోపణలున్నాయి. కలెక్టర్ అనుమతితోనే డిప్యూటేషన్లు ఇవ్వాలన్న ఆదేశాలను ఆయా విభాగాల జిల్లా వైద్యాధికారులు బేఖాతరు చేస్తున్నట్టు విమర్శలొస్తున్నాయి. కలెక్టర్, మంత్రి మౌఖిక ఆదేశాలంటూ ఒకచోటు నుంచి మరోచోటుకి డాక్టర్లు, వైద్య సిబ్బంది, ఉద్యోగులను ఇష్టానుసారంగా డిప్యూటేషన్ ఉత్తర్వులు జారీ చేస్తున్నట్టు తెలిసింది. ఈ వ్యవహారంలో పెద్దమొత్తంలో వసూలు చేస్తున్నట్టు సమాచారం. ఇవే కాకుండా అవసరం లేకున్నా నిబంధనలకు విరుద్ధంగా పోస్టుతో సంబంధం లేకుండా మ్యూచువల్ బదిలీలు చేపట్టినట్టు ఆ వర్గాలు వివరించాయి. వీటి రద్దుతో పాటు కట్టడికి కలెక్టర్ దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.
- ఇక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో హైర్ వాహనాల దందా మూడు పువ్వులు ఆరుకాయలుగా జరుగుతుందనే ఆరోపణలున్నాయి. డిప్యూటీ డీఎంహెచ్‌వో, ప్రోగ్రాం ఆఫీసర్లు సొంత వాహనాలనే హైర్ వాహనాలుగా ఉపయోగిస్తూ ప్రతీ నెల ఎన్‌హెచ్ఎం నిధులు సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లావ్యాప్తంగా క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిన కొందరు వైద్యాధికారులు జిల్లా కేంద్రానికే పరిమితమవున్నారు. ఇక ఆలన వాహనంతో పాటు ఇతరత్ర హైర్ వాహనాలూ పూర్తిస్థాయిలో తిరగడం లేదని ఆ శాఖ వర్గాలు తెలిపాయి. ఒక్క వాహనానికి కూడా జీపీఎస్ లేకపోవడం గమనార్హం. ఆరోగ్య శాఖలో హైర్ వాహనాల వ్యవహారంతో పాటు జిల్లా వైద్యాధికారులు వాహనాలపై కలెక్టర్ ప్రత్యేక నిఘా ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా బాధ్యతలు తీసుకున్న వివేక్ వెంకటస్వామిని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజి అనంతకిషన్ మంగళవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పీసీసీ కార్యవర్గంలో చోటు దక్కించుకున్న అనంతకిషన్‌ను మంత్రి అభినందించి, సన్మానించారు.

\- సంగారెడ్డి రూరల్



ఏఐబీఎస్ఎస్ అధ్యక్షుడిగా శ్రీనివాస్‌నాయక్



మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్ నుంచి నియామకపత్రం అందుకుంటున్న శ్రీనివాస్‌నాయక్

జహీరాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ మండలం చిన్న హైదరాబాద్‌కు చెందిన శ్రీనివాస్‌నాయక్ ఆలిండియా బంజార సంఘం(ఏఐబీఎస్ఎస్) సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా మంగళవారం నియామకమయ్యారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్సీ, రాష్ట్ర అధ్యక్షుడు రాములునాయక్ మంగళవారం హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో శ్రీనివాస్‌నాయక్‌కు నియామకపత్రం అందజేశారు. శ్రీనివాస్ చేస్తున్న సామాజిక కార్యక్రమాలను గుర్తించి రెండోసారి అధ్యక్షుడిగా నియమించామని రాములునాయక్ పేర్కొన్నారు. శ్రీనివాస్‌నాయక్ రెండోసారి జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక కావడం పట్ల పలువురు బంజారా సంఘం నాయకులు, అభిమానులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ రాంచందర్‌నాయక్, ఏఐబీఎస్ఎస్ రాష్ట్ర నాయకులు వాసునాయక్, సంఘం నాయకులు రవీందర్‌చౌహాన్, పోలీస్ రమేష్ పాల్గొన్నారు.

'లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలి'

మాసాయిపేట జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు వెంటనే నిర్మాణాలు ప్రారంభించాలని తహసీల్దార్ జ్ఞానజ్యోతి అన్నారు. మంగళవారం మాసాయిపేట మండల కేంద్రంలో 49 లబ్ధిదారులకు మొదటి విడత ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్, నాగిరెడ్డి, మెకానిక్ శ్రీనివాస్, ఉపసర్పంచ్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతోనే వికసిత్ భారత్



ఖేడ్‌లో కరపత్రాలను పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

నారాయణఖేడ్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలతో వికసిత్ భారత్ దిశగా పయనిస్తుందని బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజునాయక్ అన్నారు. నారాయణఖేడ్ పురపాలక అధ్యక్షుడు రాశేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో పురపాలక పరిధిలోని కుమ్మరిగల్లి, నెహ్రూనగర్‌లో మంగళవారం రచ్చబండ కార్యక్రమాలను నిర్వహించారు. 11 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి ముద్రించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు.